# బలవంతం

శ్రీ బొందలపాటి శివరామకృష్ణ

సాయంత్రసమయం. చల్లగాలి అడ్డేమీ లేకుండా స్వతంత్రించి కొంపలో చొరబడుతోంది. ఇంట్లో పనిపాటులు కూతురికి పురమాయించి కోటలో కెళ్లింది అచ్చమ్మ. పుష్ప పనిపాటలు ముగింపు చేసుకొని కూర్చుంది. తల దువ్వుకోనేలేదు నల్లని వెంట్రుకలు కళ్లమీదా, చెంపలమీదా జీరాడుతున్నాయి. కట్టుకొన్నచీర నల్లబడ్డా విడువలేదు. ఆమె ముఖంలో విచారమూ, విరక్తీ, దిగులూ చెప్పలేనంత గాఢంగా కనబడుతున్నాయి. అంత విచారంతో ఎక్కువసేపు కూర్చో లేకపోయింది. తల వాల్చింది – నిద్రపట్టలేదు. పక్కయింటి పద్ధెనిమిదేళ్ల వితంతువుతో కాలం పుచ్చటంకూడా యిష్టం లేకపోయింది. ఏమీ తోచక ఏదో పుస్తకంలో పుటలు తిరగేస్తోంది. కన్నులు పుస్తకంవైపు చూస్తున్నాయన్నమాటేగాని, మనసు ఎటో – పరిపరివిధాల పోతోంది.

"తలుపు తియ్యి",అని వీథితలుపు తట్టా రెవరో. పుష్పకు కొంచెం భయంవేసింది. అట్లాగే పుస్తకంవంక చూస్తూ నిశ్శబ్దంగా కూర్చుంది.

"పుష్పా! పుష్పా! నేనే! నేను విశ్వాన్ని తలుపు తియ్యి", అన్నాడు మళ్లా. పుష్పగుండె నిబ్బరపడింది. ఆమెముఖం చిరు నవ్వుతో చిందులేసింది. హృదయం వుప్పొంగిపోయింది. తనకోర్కెలన్నీ ఈడేరినట్లే ముఖాన కరుడు కట్టుకున్న విచారాన్నంతా విసర్జించి ఆనందంతో, 'నీవా! నీవా! ఎవరో ననుకున్నా, రా! లోపలికి' అంది తలుపుతీస్తూ. 'మనిషివి మారిపోయావు, మాటకూడా గుర్తించ లేకపోయాను' అంటూ లోపలికి తీసికెళ్లి చింపిచాప పరచి కూచోబెట్టింది. తను మంచాన్నానుకుని కూర్చొని—అంది

'ఎప్పుడొచ్చావు విశ్వం?'

'ఉదయం పదిగంటల బండికి'

'కోర్సు అయిపోయిందా?'

'ఎక్కడ! మీదటికికూడా చదవాలి–కొంచెం మంచినీళ్లు తీసుకురా!' అన్నాడు చేతిరుమాలుతో చెమటబిందువులు తుడుచుకొంటూ. పుష్ప కొంచెం సేపటికి గ్లాసుతో మంచినీళ్లు తెచ్చియిచ్చి, "ఇక్కడ చదువుకొంటున్నప్పుడు మాదిరిగానే, విశ్వం, అని పిలిచాను. పట్నంలో పెద్దపెద్ద చదువులు చదువుకొచ్చావుకూడా" అని అంది.

"నీవుమాత్రం చనువుగా పిలిస్తే వెగటుగా వుండదు" అని అన్నాడు విశ్వం చిరునవ్వునవ్వుతూ.

"ఆ! మరచిపోయాను. పట్నంనుంచి కొత్త పుస్తకా లేమన్నా తీసుకొచ్చావా?" అని అంది, ఏదో పోయిన వస్తువు కళ్లెదుటపడ్డట్టు. పుష్ప తిరగెయ్యని పుస్తకం లేదు. చదువుకొనే రోజుల్లోకూడా ఆవిడకు, పుస్తకపు పురుగు, అని బిరుదుండేది.

"తీరిక లేకపోయింది. మర్చిపోయానుకూడా. వచ్చేటప్పుడు స్నేహితులతో గ్రూప్‌ఫొటోలవీ తీయించుకోవడం, మొదలైన వాటితో టైమే లేకపోయింది. ఉత్తరం వ్రాయకపోయావా?"

'నీ అడ్రసు నాకేం తెలుసు?'

'నీవు ప్రయత్నిస్తే నా యడ్రసే తెలియకపోయిందా? మాయింటిదగ్గఱ కనుక్కొనకపోయావా?'

'ఇంకేం! పూర్వపురోజులు గాదు, మా అమ్మ వుద్దేశమూ మనం చదువుకొనేరోజుల్లో మాదిరిగా లేదు. ఇంట్లో కుమిలికుమిలి చస్తున్నాను. ఆవిడుండగా పొరుగింటి కెళ్లానా, ఏదో ముంచుకుపోయినట్టు నా వెంటే వచ్చి, "యింట్లో కాలు నిలవదా" అంటుంది. ఏమల్లెపూలవాడికోసమైనా వీథితలుపు తెరిస్తే, "ఆ తలుపు తియ్యవద్దని నీకెన్నిసార్లు చెప్పాను. బుద్ధం

లేగా" అని నాసంగతైనా విచారించకుండా అను మానపడుతుంది అని కంట తడిపెట్టింది.

విశ్వానికి హృదయంలోనుంచి చిన్నప్పటి సంగతులన్నీ దొర్లుకొచ్చాయి.

"పుష్పా! పుష్పా! చిన్నప్పుడు చదువుకొనే రోజుల్లో ఎంత హాయిగా, ఎంత కులాసాగా స్వాతంత్ర్యంగా వుండేవాళ్లమో ఆరోజులు జ్ఞాపకమున్నాయా? మనమిద్దరము పొద్దుపొయ్యేదాకా చదువుకొని ఒక్కచోటే పండుకొనేవాళ్లము. ఆస్వాతంత్ర్యమూ, చనువూ ఇప్పుడు లేవుగదా! ఉందామన్నా సంఘం దూషిస్తుంది. కులం యీర్ష్యచెందుతుంది" అన్నాడు విశ్వం కొంచెం విచారంగా.

"విశ్వం! ఆరోజుల్లో మన మనసులో ఎన్నో భావాలు చెలరేగేవి. ఎంతో వుత్సాహంగా వుండేవాళ్లము. నీవు నాకిచ్చిన ఆనందానికి నిన్ను నా జన్మలో మరచిపోను" అని తన సజలనేత్రాలను విశ్వం దృక్కుల్లోకి పోనిచ్చింది. ఆచూపులో అమాయకత్వమూ, విశ్వాసమూ, విచారమూ వున్నాయి.

కొంచెంసేపు వాళ్లకళ్లేవేవో మాట్లాడుకున్నాయి. 'మీ యమ్మ ఎక్కడికెళ్లింది?' అన్నాడు విశ్వం రెండునిమిషాల తర్వాత.

"ఇంకెక్కడికి వెళ్లుతుంది? పనిలోకి" అంది కొంచెం ఏవగింపుగా. విశ్వం మాట్లాడినంతసేపూ పుష్పహృదయం ఉప్పొంగిపోయింది. కాని తల్లిమాట తలవగానే ఆమెహృదయంలో చెయ్యేసి కదపినట్లయింది. రోజూ తినేతిట్లూ పడేదెబ్బలూ జ్ఞప్తికొచ్చాయి. అణచుకొన్నదుఃఖం పొంగులా పొర్లి వచ్చింది.

పుష్పహృదయంలోనుంచి అసందర్భంగా అనుకోకుండా దొర్లుకొచ్చిన దుఃఖాన్ని చూచి కలవరపడ్డాడు, కలతజెందాడు విశ్వం.

'ఎందుకేడుస్తావు ?'

"భావికర్తవ్యం నన్ను బాధిస్తోంది" అంది ఏడుస్తూ.

విశ్వానికేమీ అర్థంకాలేదు. "అసలు సంగతేమిటి?" అన్నాడు ఆదుర్దాతో

'నన్ను పట్నం తీసుకెళ్లాలి.'

'దీనికే! యీ యేడుపంతా ఎందుకు?"

'ఇక్కడనే నొకక్షణముండలేను'!

'ఎందుచేత? ఎవరయినా ఏమన్నా అన్నారా?,

'ఎవరూకాదు. మా అమ్మే ఆస్థానంలో పనికెళ్లమని తిట్టనిరోజులేదు. చావుదెబ్బలు కొడుతోంది. సహించలేకుండా ఉన్నాను. నాలుగురోజులనుంచీ వారు తీసుకురమ్మన్నారని ఒత్తిడిచేస్తోంది. నువ్వొచ్చే ముందే వెళ్లింది నన్ను తిట్టి. ఇంకా కొద్దిరోజులవఱకు వెళ్లకుండా ఎదిరిస్తే నాప్రాణాలుండవు. ఉండేవికాదు కూడ. నీవు శెలవలకు వస్తావనే వూరుకున్నాను ఏదారన్నా చూపెడతావని. తప్పక తీసికెళ్లాలి. ఇక్కడనే నుండలేను" అని తన స్థితిగతులు చెప్పుకొని విశ్వాన్ని కౌగిలించుకొని ఏడ్చింది.

ఆమెకళ్లల్లోనుంచి విరజిమ్మే చూపుల్లో వున్న దిగులూ, చింతా, విచారమూ విశ్వంహృదయాన్ని కలవరపెట్టాయి. "ఏముందీ పరిస్థితులే కారణం. నీ అందానికీ తెలివితేటలకూ తగిన అవకాశాలు లభించలేదు. ప్రపంచంలో నీలాంటిపిల్లలు ఎందరో యీ అవస్థలు పడుతున్నారు. ప్రాణా లర్పిస్తున్నారు" అన్నాడు విచారంగా.

'ఈ బాధలు సహిస్తూ వూరుకోమంటావా?'

పుష్పా! నిన్ను నాజీవితంలో మరచిపోతానా? ఈ నాలుగురోజులూ సహించు. నావెంట పట్నం తీసికెళతాలే" అని ఓదార్చాడు.

తీసికెళతా ననగానే పుష్ప ముఖకమలం వికసించింది. ఆమె కన్నులు అవ్యక్తంగా నవ్వాయి. రెండు నిమిషాలపాటు ఎవరూ మాటాడలేదు. నిశ్శబ్దం! 'చాలా ప్రొద్దుపోయింది, యింటిదగ్గఱ ఎదురుచూస్తూ వుంటారు' అని తన తొడమీదవున్న పుష్పశిరాన్ని ఎత్తబోయాడు విశ్వం. 'ఎక్కడికి యీగాంభీర్యపు చీకట్లో, నాకు భయమేస్తుంది. వద్దు' అని లేవబోతున్న

విశ్వంచేయి పట్టుకుని కూర్చోబెట్టింది. ఆమె కరుణ దృక్కుల్లో బంధింపబడి లేవలేకపోయాడు విశ్వం.

పుష్పకన్నులు మూతలుపడ్డాయి. పుష్పశిరం అతని వుదరంమీదే వుంది. నిశ్శబ్దం నిశ్చలం. పుష్ప ముంగురులుమాత్రం సన్నగాలికి చిందులేస్తున్నాయి.

పుష్ప విశ్వాలస్నేహం చిన్నతనాన్నే మొలకలెత్తి వేరులుపారి తెగనితీగయింది. ఒకటే క్లాసులో చదువుతూ, అన్యోన్యంగా వుండేవాళ్లు. ఒకరోజు ఎడబాటు కలిగితే సరి, వారి హృదయాలు తపించేవి కళ్లబడేవఱకు.

విశ్వం ఆమె తెలివితేటలూ అందచందాలు చూచి అబ్బురపడేవాడు. పైగా తన్ను మనసార ప్రేమించింది. పుష్పను పెళ్లిచేసుకొంటే, తన జీవితం ఆనందంగా వెళ్లిపోతుం దని, అంతర్యంలో వున్నా, తనకోరిక నెరవేరుతుందో లేదోనని ఆప్రసంగం పుష్పతో ఎప్పుడూ తీసుకురాలా.

పుష్పకూడా విశ్వమంటే ప్రాణా లర్పిస్తుంది. రజస్వ లయినతర్వాతగూడా, సంఘం ఎంతదూషించినా, తల్లి ఎంత మందలించినా లెక్క చెయ్యకుండా విశ్వానితో చనువుగా స్వాతంత్ర్యంగా తిరుగుతూ వుండేది. విశ్వమే తన జగత్సర్వమనీ, తనప్రేమ కుసుమాన్ని అతని కర్పించాలనీ, కుతూహల ముండేది. కాని తన కులవృత్తులు తలపుకు రాగానే నిరాశచెంది హతాశురా లయ్యేది.

తల్లి వుద్దేశంగూడా తనకేమీ అర్థం కావటం లేదు.రజస్వలయి రెండేళ్లయింది.పదహారో ఏడు కూడా వచ్చింది. తన భవిష్యత్తును గురించి ఆమె కేం పట్టినట్టే తోచదు. పెండ్లిమాట తలవదు. తనే ఆమాట అంటే మండిపడుతుంది. నౌకరీలోకి వెళ్లమని నానాచీవాట్లూ వేస్తుంది. తనతో చదువుకొన్నవాళ్లకూ, ఆడుకొన్నవాళ్లకూ పెళ్లిళ్లయి, తమ భర్తలతో కాపురం చేస్తూ, ఆనందంగా జీవితం వెళ్లబుచ్చటం చూడటంలేదూ? తన్నెవరయినా చేసుకోరని వూరుకొందా? చదువు లేదా? చక్కదనం లేదా? చేసుకొనేవాళ్లు ఎందుకు లేరూ? ప్రేమిస్తోంటే గూడా, తను భర్తతో ఆనందంగా కాపురం చేస్తూవుంటే చూస్తూ సహించలేదా ఇం కేమై యుంటుంది? అని యాలోచనలతో, ఆందోళనలతో వ్యథపడుతూ ప్రొద్దుపొయ్యేదాకా నిద్రపొయ్యేదికాదు పుష్ప. విశ్వం మద్రాసులో వున్నరోజుల్లో, తనతో స్నేహానికి అప్పట్లో పద్దెనిమిదేళ్ల వితంతువుతప్ప ఎవరూ లేరు. ఈ ఆందోళన అంతర్యంలో చెలరేగినప్పుడు ఆపుకోలేక తల్లి నడిగితే నానాచీవాట్లూ వేసేది. అమ్మా, ఆకమలా, ఆమెభర్తా ఎంత ఈడుజోడుగా వున్నారో చూడూ అంటే, నువ్వూ యువరాజుగారితో యీడుజోడుగా సరససల్లాపా లాడుదువుగానిగా, అని అంది నవ్వుతూ. పెళ్లిమాట చెబితే, వీపు బద్దలవుతుందని ఆరోజున పుష్పను ఎన్నెన్నో తిట్టింది, అచ్చమ్మ. పుష్ప ఆరోజల్లా అన్నం తినలేదు. ఇంట్లోనుంచి లేచి ఎక్కడికన్నా పోదామనుకుంది. బంధువులుమాత్ర మెవ రున్నారు.మద్రాసు విశ్వం దగ్గఱకెళ్లాలని ప్రయత్నించింది. ఎక్కడవుండేదీ తెలియదు. వెళ్లింతర్వాత అతను వుత్తరం ముక్కయినా వ్రాయలేదు.

విశ్వం వచ్చాడు మద్రాసునుంచి. తనకష్టాలన్నీ అతనితో చెప్పుకొంది, తనసర్వస్వమూ విశ్వమేయైనట్టు. పట్నం తీసికెళతా నన్నాడు. ఇప్పుడు ఆమె ఆనందానికి అంతులేదు. ఈ ఘోరనరకంలోంచి బయటపడి, తల్లినుండి తప్పించి, పట్నంప్రయాణం కట్టాలని కోరిక. ఆమెకోరిక నెరవేరుతుందో — లేదో.

౨

అచ్చమ్మ తనముత్తవతల్లిదగ్గర్నుంచీ సాంప్రదాయికంగా వస్తున్నఆస్థానంలో దాసీగా అంటిపెట్టుకునుంది. విధిలేనికాలం ఆమె జీవితాన్ని అట్లా, ఆస్థానంలోని చీపురుకట్ట కంకితమొనర్చి మోసపుచ్చింది. తన యాభై సంవత్సరాల జీవితంలోనూ సుఖంగా గడపిన రోజులూ, విశ్రాంతిగా జీవించినరోజులూ లేవు. ఎప్పుడూ మేడల్లో,మిద్దెల్లో, భోగాలమధ్యా తిరుగుతూ ఖేదముఖంతో కళాశూన్యంగా జీవంలేకుండా కడుపు కక్కుర్తికోసం బ్రతకలేక బ్రతుకుతూవుంది.

కూతురు ఈడేరింది. పదహారో సంవత్సరం. ఆ అమ్మాయి ప్రతి అవయవంలోనూ నవయౌవనం

లాస్యం చేస్తోంది. పచ్చని ఎరుపూ, నల్లనికురులూ— తగిన ఒడ్డూపొడుగూ. మొత్తానికి ఆకర్షవంతంగానే యుంటుంది. చదువుకొని చక్కని జ్ఞానాలు సంపాదించిందికూడాను. ఆజ్ఞానంవల్లో, ప్రపంచాన్ని అర్థంచేసుకోడంచేతో చిన్నతనాన్నే స్వాతంత్ర్యబీజాలు నాటుకుపోయాయి. అచ్చమ్మకు సాంప్రదాయకంగా వస్తూన్న నౌకరీలో పుష్పను చేర్పించి, తనుఏ తులసిపూజో చేస్తూ యాత్రలన్నీ చూచి రావాలని కుతూహలం కలిగింది. అదీ గాక జమీందారుగారు "నీకూతురు ఈడేరింది కామాసు. పనిలోకి యింకెప్పుడు పంపిస్తావు. పనిపాటులు ఎప్పుడు నేర్చుకొంటుంది. నీవు ముసలిదాని వయిపోయావు. మతిమరపుకూడా పుట్టింది. చస్తూ బతుకుతూ ఇంకెంత కాలం దేవులాడతావు. గుర్రంలాగు కుక్కను పెంచి రెడ్డి తానే మెరిగినసామెతగా వుందే. రేపటినుంచీ పనిలోకి రాకు. ఎన్నిసార్లు చెప్పడం." అని అన్నాడు.

అచ్చమ్మకు భయమేసింది, వణకిపోయింది, నౌకరీ ఎక్కడ వూడుతుందోనని.

'అట్టా కోప్పడితే ఎట్టా బాబూ! మేం బతికేది. రేపు వెంటబెట్టుకొనివస్తాగా' అంది అతనిపాదాలు వత్తుతూ సవినయంగా.

వారు ఎన్ని యుగాలనుండో తపస్సుచేసి దేవుని మెప్పుబడసి సంపదలు పొంది అనుభవిస్తున్నారనీ, ఆపరమభక్తులకు సేవ చెయ్యటానికేతమ్ము భగవంతుడు పుట్టించాడనీ, వారిని ఎదిరిస్తే ఘోరనరకంలో పడతామనీ ఆమె నమ్మకం. అందుచేతనే వారు కొట్టినా, తిట్టినా మనసులోనైనా తలచకుండా శాంతించి వూరుకొంది. పడుచుతనంలోకూడా రాణి చెప్పినట్లు వింటూ తనశరీరం రాజుగారిసౌఖ్యంకోసం నిర్మింపబడిందను తలంపుతో వారి కామాగ్ని చల్లార్చే యంత్రంలాగు మానాన్నమ్ముకుని, శీలం చెడగొట్టుకొని పొట్టకూటికి దారుఢ్యంలేకుండా, విడచినపాత కట్టే, వదలిన ఎంగిలి తినీ ఎంతో నీచపుబ్రతుకూ నికృష్టపుబ్రతుకూ బ్రతికింది.

ఆ వుచ్చస్థానాన్నే సొల్తుగా తనబిడ్డకు బదలాయించాలని కుతూహలం. పుష్పమాత్రం దీని కంగీకరించలేదు. ఆమె అభిప్రాయాలూ ఆశయాలూ వేరు. తల్లి చేసే నికృష్టపుపనులు చూచి ఏవగించుకొనేది. పుస్తకజ్ఞానంవల్లో మనోవేగంచేతో చిన్నతనంలోనే స్వాతంత్ర్యబీజాలు నాటుకుపోయాయి.

అందుచేతే ఒకయువకుణ్ణి హృదయపూర్వకంగా ప్రేమించింది. అతనుకూడా తనను మనసారప్రేమించాడు. పెళ్లిచేసుకోవాలని కోరిక కలిగింది. సంఘసంస్కారికూడాను. అందుచేతే కులగోత్రాలనూ, వృత్తినీ విచారించలేదు. తల్లినికూడా యిష్టపరచాలని శతవిధాల ప్రయత్నించింది. కాని అచ్చమ్మ మనసు యిసుమంతైనా కరగలేదు. రేపటిరోజే పట్నం ప్రయాణానికి నిశ్చయించారు.

అచ్చమ్మహృదయంలో దుడుకుగానే వుంది. తననోట మట్టిగొట్టి ఎక్కడ ఎగిరిపోతుందోనని. రోజూ విశ్వం అచ్చమ్మయింటికిరావడమూ, ఆవెకవెకలూ, పకపకలూ చూచి అనుమానపడుతూనే వుంది. ఇప్పటి సంభాషణ ఆమె అనుమానానికి దోహద మిచ్చింది. "జాగ్రత్తగా వీళ్ల నొక కంట కనిపెట్టియుండకపోతే గూట్లో గువ్వల్లాగు ఎప్పుడో ఎగిరిపోతారు. యీ సంగతి కోటలో ఎవరో చెప్పివుంటారు. లేకపోతే జమీందారుగారు అంత నొక్కి ఎందుకడుగుతారు. త్వరపడకపోతే నాకు చివాట్లూ చెప్పుదెబ్బలూ తప్పవు. నౌకరీ కాస్తా వూడుతుంది. తర్వాత తనగతేం కావాలి బ్రతుకుతెరువో!" అని ఆతురతపడింది.

మర్నాడు విశ్వంతో స్పష్టంగా చెప్పింది యికమాగడప తొక్కితే మర్యాద దక్కదని.

అచ్చమ్మ ఎన్ని చీవాట్లేసినా లేకుండా చూచి పుష్పతో మాట్లాడిపోతూనే వున్నాడు.

సాయంత్రం నాలుగ్గంట లవుతుంది. ఎండతీవ్రత తగ్గింది. మందసమీరుడు మందమందంగా వింజామరములను విసరుతున్నాడు. అచ్చమ్మ పనిపాటు లవీ తనే సర్దుకొంటూ, వుత్సాహంగా ఉండే మాటలు చెబుతోంది.

'అమ్మాయీ! పుష్పా! తలదువ్వుతారా!' అని పిలచి తలదువ్వి, ముచ్చట ముడేసింది అచ్చమ్మ.

'ఇదేమిటి యిట్లా బిగించావు. జడలెయ్యటానికి నీకు బహుమానాలివ్వొచ్చు' అని వెకిలిగా నవ్వింది పువ్వు.

'నా కెందుకులే చచ్చే ముసలిదానికి - ఆ బహుమానాలన్నీ నీకే యిస్తారులే, ఇప్పుడు పేసను మారిపోయింది. ఆ చాపచుట్టలూ పక్కపాపట్లూ వదులు జడలూ మా కాలంలో వున్నాయా? చక్కగా కొప్పు పెట్టుకొని యింత కుంకంబొట్టు వుంచుకొని పనిలోకి వెళ్లే వాళ్లం.'

'ఊ! వెళ్లేవాళ్లే ఆనికృష్టపు పనుల్లోకి' అని బర్మాముడి చుట్టి పూలమాల కట్టింది. చీర మార్చి చింపి చాపమీద కూర్చొని, నిన్న చదవగా మిగిలిన పుస్తకంలో పుటలు తిరగవేస్తోంది. ఇంతలో చంద్రవంక లాగు ముఖాన బొట్టుపెట్టి పీచులాంటి తెల్లని వెంద్రుకలను సర్దుకొంటూ పువ్వుదగ్గర కొచ్చింది తల్లి.

'లే పోదాం యిప్పటికే ఆలస్యమైంది.'

'ఎక్కడికే?' అంది పుస్తకంవైపు చూస్తూనే.

'మళ్లా ఎప్పటిపాటేనా?'

'నన్ను వాగించక పో'

'మాట్లాడవేం నోరు పడిపోయిందా?'

'ఎక్కడికే?'

'ఎక్కడికా ఏట్లో పడి చావటానికి' అని అంది కొంచెం కోపంగా.

'దీనికన్నా అదే మేలు!'

'చావరాదూ, నిన్నెవరయినా పట్టుకున్నారా? రవ్వా రద్దీ లేకుండా వుంటుంది; నాకు కోపం రానియ్యక లే ప్రొద్దుగూకుతోంది.

'నీమూలాన చివాట్లూ చెప్పదెబ్బలూ నేను పడే యోగం పట్టింది. అంతే కాదు నౌకరీవూడుతుంది. నిన్న స్పష్టంగా చెప్పేశారు. రేపు నీకూతుర్ని తీసుకు రాకపోతే కోటలో అడుగుపెట్టవద్దని.'

'వెళ్లకు'

'బ్రతుకు తెరువు?'

'బ్రతుకు తెరువా? ఆ ఎంగిలికూటి కాశపడి పెళ్లీ పేరంటంలేకుండా మా నాన్నమ్మకుని వెట్టిచాకిరి చేసేకంటే పస్తులుండి మలమలమాడి చస్తే మంచిది.'

'డాంభీకాల కేంతరువు. తెస్తే బాగా నేతింటావు. వాళ్ల సొమ్ముతో పెంచి నిన్నింతదాన్ని చేశా' అని నిలబడేవుంది పువ్వు లేస్తుందేమోనని.

పువ్వు తలవంచుకొని పుస్తకం చూస్తూనేఉంది. అచ్చమ్మకు కూతురుమీద అంతులేని కోప మొచ్చింది. ఏంచేస్తుంది? లోలోన కుమిలిపోతోంది.

'నీచదువూ నువ్వూ చట్టుబండలుకాను లేవే' అని పువ్వుచేతిలోని పుస్తకం లాగి దొడ్డికేసి విసరింది అచ్చమ్మ.

పుస్తకం బురదలో పడింది. నిశ్శబ్దంగా వెళ్లి పుస్తకానికయినమట్టి తుడుస్తోంది పువ్వుపైటచెంగుతో. నడువు అని గదమాయించింది, ఎన్నో తిట్టింది తల్లి. పువ్వు మాత్రం నిలబడేవుంది.

'పద' అని తలమీద చెయ్యేసి నెట్టింది.

'నే వెళ్లను' అని కూర్చుంది పువ్వు. అచ్చమ్మకు కూతురుమీద అంతులేనికోప మొచ్చింది. యింతసేపు మాటల్తో చెబుతోంటే నిర్లక్ష్యంగా వుందే అని గబగబా మూలనున్న కర్ర తీసుకొచ్చి పదవేం అంది కర్ర ఎత్తి. పువ్వు తొణకలా బెణకలా అట్లాగే కూచోనుంది.

'వీపు బద్దలవుతుంది.'

'నన్ను కొట్టు, తిట్టు, ప్రాణాలు తియ్యి. నేను కోటలోకిమాత్రం అడుగుపెట్టను' అని అంది నిర్భయంగా పువ్వు.

కోపంతో కుమిలిపోతున్న అచ్చమ్మ శరీరం భగ్గున మండింది. ఫెడీ ఫెడీ వీపుమీద నాలుగు తగిలించింది. పువ్వు పళ్లప్పజెప్పి వూరుకున్నది.

అచ్చమ్మ రొప్పుతూ రోజుతూ 'నీ యమ్మ కడుపుకాల, నీపంతమేమేమో' అని కర్రవతల పారేసింది. అంతకన్న చేసేదేం కనబడలేదు ఏడ్చుకుపోతుందా ఓపిక లేదు. నిరాశ జెందింది. తనకు చివాట్లూ చెప్పు

దెబ్బలూ తప్పవు. నాకకీ వూడుతుందేమో నన్నగుండె జకుపుతోనే వెళ్లింది కోట్లోకి.

భయంతో వణకుతూ పోయి, జమీందారుగారి పాదాలమీదపడి విషయమంతా విన్నవించుకొంది.

జమీందారుగారు మండిపడ్డాడు. 'నీకు యీ విషయం ఎన్నిరోజులనుంచో చెబుతున్నాను. విన్న పాపాన పోయావా? దాసీముండకు యింతబిగదీపా' అన్నాడు.

## 3

సూర్యుడు అస్తమించాడు. కనుచీకట్లు కమ్మాయి. బజారుల్లో ఆడుకోటానికి పోయిన పిల్లలు విసిగి యింటికి పోతున్నారు. పుష్ప ఆనందంతో తనపుస్తకాలూ బట్టలూ సర్దుకొంటోంది. ఈ బాధల్లోనుంచి ఎప్పుడు బయటపడదామా అని. సామానదీ సర్దుకో బండి తోలించుకొస్తా నని విశ్వం చెప్పిపోయిందగ్గర్నుంచీ తొందరపడుతోంది. మధ్యమధ్య బజారులో చప్పుడైనప్పుడల్లా వీధితలుపు తీసి చూచి నిరాశతో మళ్లా సర్దుకొంటోంది. విడచిన చీర మడతయినా పెట్టకుండా కుక్కింది ట్రంకుపెట్టెలో. తన పనులన్నీ సమాప్తమయిన తర్వాత బజారుతలుపు తీసి ఎటునుండయినా బండి వస్తోందేమోనని తేరిపార జూచింది. బండిజాడే లేదు.

*　　　*　　　*

బైట బండీ ఆగినచప్పుడు. సంతోషంతో హృదయానన్నుప్పొంగిస్తూ చేతిపెట్టె తీసుకొని వచ్చి వీధితలుపు తెరచింది పుష్ప.

"హో! హో! హో! ప్రయాణానికి పెట్టెతో సహా తయారయిందే. ఏమందం? ఏంసొగసూ? అందుకనే రాజుగారు పట్టుపట్టారు" అంటూ రౌడీలు కొందరు ఎదుటవడ్డారు పుష్పతలుపు తెరవంగానే. పుష్ప గుండె నీరై పోయింది. హృదయంలో ఉప్పొంగే ఆనందం ఒక్కసారిగా పటాపంచలై పోయింది. నిర్ఘాంతపోయి నిలబడిపోయింది. నోటమాటరాలేదు. శరీరం కంపించిపోయింది. చేతిలోనుంచి పెట్టె జారికాలిమీద పడ్డదికూడా తెలియలేదు. ఎదిరించినా సాధించలేదు. కోపాలకూ, శాపాలకూ దగ్ధంచేసే మహాపతివ్రతల శక్తిఉంటే పుష్పచూపులకు జమీందారుగారి రౌడీలు మాడిభస్మమై పోయేవారే.

'బండి ఎక్కు'

'ఎందుకు?'

'ఎక్కవేం!'

ఎక్కడికి ?'

'ఎక్కడికా? రోజూ నీవు వెళ్లనని ఎదిరించే చోటికి.'

పుష్ప హతాశురా లై పోయింది. మాటామంతీ లేని మూగలాగు ఆమె హృదయం అణిగిపోయింది. వాళ్లనే మాటలు సహించ లేకపోయింది. వాళ్లు ఎక్కమని తొందరచేస్తున్నారు. పుష్ప కదల్లేదు.

ఆఖరికి వాళ్లే బండీ ఎక్కించి చుట్టూ మూగారు.

దారిపొడుగూనా వాళ్లు ఎన్నిచేసినా, పయట లాగినా, ఇంకెన్నెన్నో చేసినా, తలవంచుకొని కిక్కురు మనకుండా వూరుకొంది "నీపనిపాట లెవరుచేస్తారు నీయబ్బ! ముసలిది చెబితే లక్ష్యంలేదేం? పెళ్లిచేసుకొంటావా? పోయి చేసుకొందువుగానిలే" అని ఎన్నో అన్నారు. పుష్ప పెచ్చుపెరుగుతున్న ఆవేశాన్ని సమయముకాదని అణచుకొని ఓమూల నక్కింది.

పెద్ద గోడలమధ్య ఓ సుందరభవనం ముందు బండీ ఆగింది. వాళ్లామెను తీసికెళ్లి ఓగదిలో ప్రవేశపెట్టారు. గదయితే చిన్నదేగాని సుందరంగా వుంది. గోడలమీద నగ్నచిత్రాలూ, నిలువుటద్దాలూ వ్రేలాడుతున్నాయి. సారాయీలూ, సిగరెట్లూ, ఇంకేవేవో సీసాలూ డ్రాయరుమీద పెట్టివున్నాయి.

పుష్పగుండె దడదడ లాడుతోంది. నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడిపోయింది. ఇంతలో ఇరవై ఏళ్ల యువకుడువచ్చి చేయిపట్టుకున్నాడు. తలుపు మూత.

*　　　*　　　*

తెల్లవారింది. సూర్యుడు తన లేతకిరణాలతో తూర్పు దిక్కునుండి తొంగిచూస్తున్నాడు. చూచి ఆనందం పొందలేక పక్షులు తమగూళ్లనుండి లేచి

పోతున్నాయి. అచ్చమ్మ సంతోషంతో తనసాధనాన్ని తీసుకొని గదిదగ్గఱకు చేరింది.

తలుపు కొడుతూ "అమ్మాయి! పుష్పా! లే" అని మెల్లగా పిలచింది.

నిశ్శబ్దం-

మళ్లా నెట్టింది, కేక పెట్టింది.

ఇంకా మెలకువ రాలేదేమోనని "పుష్పా! యింత ప్రొద్దెక్కేదాకా పడుకొంటే ఎట్లా" అని తలుపుసందుల్లోంచి చూస్తూ పిలిచింది.

కిటికీలోనుంచి తేరిపార జూచింది. మంచంమీద ఎవరూ లేరు. గదంతా గాజుపెంకుల్తో నిండిపోయి ఉంది.

అచ్చమ్మకు గుండె కొంచెం దడదడ లాడింది.

ఈవార్త కోటలో పాకిపోయింది. జనులు పోగయ్యారు, కిటికీల్లోనుంచి కేకలేస్తూ చూడసాగారు.

తలుపు తుంపులైంది. పుష్ప చచ్చి పడి వుంది. గొంతుదగ్గఱ నొక్కుకుపోయిన గంట్లతో పుష్పశవం ప్రక్కనే పడివుంది యువరాజుశరీరం. గుడ్డలన్నీ రక్తంతో నిండిపోయాయి. శవాలచుట్టూ మూగిన గుంపులోనుంచి దూరి చూచాడు విశ్వం.

* * *

సూర్యుడు నదిఒడ్డున తాటిచెట్లల్లోనుంచి దిగులు ముఖంతో తొంగిచూస్తూ అస్తమించాడు. నీటికాకులు నెత్తిమీదనుండి ఎగిరిపోతున్నాయి. మసకపడింది. విదియచంద్రవంక రక్తంతో తడిపిన కత్తిలాగు మెరుస్తూంది. గాలి రివ్వున చెట్లను దూసుకుపోతోంది. నదిరెండోఒడ్డున శవాలు కాలిపోతున్నాయి. నాలుకలవలె ఎగరగొట్టే జ్వాలలు చితిమీదనుండి లేచి ప్రక్కనున్న నలుగురను అందుకో జూస్తున్నాయి. ఇంతలో ఎవరిదో వెకిలినవ్వూ, ఏడుపూ వినబడ్డాయి. అయిపోయింది.

---


సహజ సౌందర్యము



'కామినియా నూనె' ప్రతిరోజూ వాడుట వల్ల వేలకొలది స్త్రీలు తమ కేశసౌందర్యాన్ని పెంపొందించు కుంటున్నారు. ఆ నూనె వెండ్రుకలు బాగా పెరుగునట్లు చేసి మెదడుకు చలవ చేయును.

కామినియా నూనె

(రిజిస్టర్డు)

సీసా 1-కి రూ 1/- మూడు సీసాలకు రూ 2/10-
వి. పి. ఛార్జీలు వేరే. ఉచితమైన మోస్తరు సీసాకు మూడుకాన్ల బిళ్లలు పంపండి.

ఓటో దిల్ బహార్

(రిజిస్టర్డు)

ప్రాగ్దేశ విశిష్టతగల చక్కని సువాసనద్రవ్యము. చాల సమ్మోహనము. ఎంతకాలమైనా వాసనపోకుండ నుండును.

¼ ఔన్సు రూ 1/4- ఒకడ్రాము అణాలు 12/-
వి. పి. ఛార్జీలు వేరే.

సువాసనగల కార్డు 1 అణా. ఉచితమైన మోస్తరునకు 2 అణాల బిళ్లలు పంపండి.

సోల్ యేజెంట్లు:

ANGLO - INDIAN DRUG & CHEMICAL CO., BOMBAY. 2.